# గ్రామసభలకు కాంగ్రెస్ శ్రేణులు తప్పనిసరిగా హాజరు కావాలి

## ఆంజనేయులు గౌడ్



**మెదక్ (ప్రజాజ్యోతి)**

తేదీ 27-08-2026 గురువారం రోజున పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారి సూచన మేరకు మెదక్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామసభలకు గ్రామ సర్పంచులు, బూత్ లెవల్ ఏజెంట్లు (దీూాం), గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ సూచించారు.

వివరాలు 2లో



# సంగారెడ్డి మెదక్

గురువారం 27 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:07




# 9 ఏళ్లుగా కొండాపూర్‌లోనే ఏపీఓ!

## - బదిలీ నిబంధనలు ఈ అధికారికి వర్తించవా?

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు నిబంధనలు ఉన్నప్పటికీ.. కొండాపూర్ మండలంలో ఒక ఏపీఓ మాత్రం సుమారు తొమ్మిదేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారనే విషయం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. అన్ని శాఖల్లో అధికారులు, ఉద్యోగులకు బదిలీలు జరుగుతున్న వేళ.. ఈ ఒక్క అధికారికి మాత్రం బదిలీ ఎందుకు జరగడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

మిగతా 2 లో

# 22A జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి



## - మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి డిమాండ్

## - ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపు-



**అమీన్‌పూర్ (ప్రజాజ్యోతి)**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 22ఏ నిషేధిత భూముల నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తీవ్రంగా డిమాండ్ చేశారు. అమీన్‌పూర్ పరిధిలోని 75 శాతం కాలనీవాసులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 29న తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రజలకు, బాధితులకు ఆయన పిలుపునిచ్చారు. మాజీ మంత్రి హరీష్ రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిల ముఖ్య నాయకత్వంలో ఈ పోరాటం జరుగుతుందని పాండురంగారెడ్డి తెలిపారు.

మిగతా 2 లో

# 22A జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి

మొదటిపేజీ తరువాయి

అమీన్‌పూర్‌లో మొదట్లో హెచ్‌ఎమ్‌డీఏ అనుమతులు పొందిన లేఅవుట్లను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండగా, ఇప్పుడు 22ఏ పేరుతో సామాన్య, పేద ప్రజల ఉసురు తీయడం సరికాదన్నారు. అమీన్‌పూర్ పరిధిలో సుమారు 200 పైచిలుకు సర్వే నంబర్లలో ఉన్న 600 ఎకరాలకు పైగా భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. నారాయణరావు లేఅవుట్‌లోని 40 నుండి 50 సర్వే నంబర్లకు సంబంధించి ఉమ్మడి సమైక్య రాష్ట్రంలో ఉన్న కేసులను ఇప్పుడు సాకుగా చూపడం తగదన్నారు. సర్వే నంబర్ 157లోని చక్రపురి కాలనీలో ఇద్దరు రైతుల మధ్య కేవలం 2 ఎకరాల వివాదం ఉంటే, మొత్తం 12 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టడం ప్రభుత్వ అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు. గతంలో స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన భూములను కూడా ప్రొహిబిటెడ్ జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే బాధిత కాలనీవాసులు తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్ రావును కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారని, బీఆర్ఎస్ పార్టీ వారికి పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ పరిశీలిస్తామని చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం దిగి రాకపోతే కలెక్టరేట్‌ను ముట్టడించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో ఈ 22ఏ జీవోను ఎత్తివేసేంత వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. బాధిత ప్లాట్ల యజమానులకు అండగా నిలిచేందుకు, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 29న స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో బీరంగూడ, కిష్టారెడ్డిపేట్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడ, అమీన్‌పూర్ పరిసర కాలనీల ప్రజలకు అందుబాటులో ఉండేలా 'నవ్య సర్కిల్' (గ్రీన్ ఫీల్డ్) వద్ద భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాండురంగారెడ్డి ప్రకటించారు. ఈ ధర్నాకు మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.



అమీన్‌పూర్ జిహెచ్‌ఎంసి సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీల వాసులు, సిటిజన్లు, బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అమీన్ పూర్ మాజీ కౌన్సిలర్ లు బాశెట్టి క్రిష్ణ, పటోళ్ల కల్పన ఉపేందర్ రెడ్డి, బిజిలి రాజు, గోపాల్, మాజీ కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, యూనుస్, అమీన్ పూర్ మాజీ సర్పంచ్ మంజుల చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ రావు, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, యువ నాయకులు రుశ్వంత్ రెడ్డి, శ్రీను, వివిధ కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 9 ఏళ్లుగా కొండాపూర్‌లోనే ఏపీఓ!

మొదటిపేజీ తరువాయి

### ఒకే చోట తొమ్మిదేళ్లు.. ఇదేంటి ప్రత్యేక మినహాయింపు?

సాధారణంగా ఒకే స్టేషన్‌లో ఉద్యోగులు ఎక్కువ కాలం కొనసాగకుండా బదిలీల ద్వారా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 2026 బదిలీ మార్గదర్శకాలపై వచ్చిన నివేదికల ప్రకారం, ఒకే స్టేషన్‌లో నాలుగేళ్లకు మించి కొనసాగుతున్న ఉద్యోగులను బదిలీ చేయాల్సిన నిబంధన ఉంది.అలాంటి పరిస్థితుల్లో కొండాపూర్ మండల ఏపీఓ మాత్రం తొమ్మిదేళ్లుగా ఒకే చోట ఎలా కొనసాగుతున్నారు? అనే ప్రశ్నకు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

### అన్ని శాఖలకు బదిలీలు.. ఏపీఓకు మాత్రం ఎందుకు కాదు?

బదిలీల విషయంలో ప్రభుత్వ నిబంధనలు అందరికీ ఒకేలా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక అధికారి ఇంత సుదీర్ఘకాలం ఒకే మండలంలో కొనసాగడానికి ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయా? ఏదైనా మినహాయింపు ఇచ్చారా? అనే విషయాలను జిల్లా ఉన్నతాధికారులు స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.తొమ్మిదేళ్ల సుదీర్ఘకాలం ఒకే చోట విధులు నిర్వహించడం వెనుక కారణమేంటి?బదిలీల సమయంలో ఈ అధికారి పేరు ఎందుకు పక్కనపెట్టబడుతోంది?బదిలీ నిబంధనలు అందరికీ ఒకటేనా.. లేక కొందరికి ప్రత్యేకమా?అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

### జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

ఒకే చోట సుదీర్ఘకాలం పనిచేస్తున్న అధికారుల విషయంలో ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు సేవా కాలాన్ని పూర్తిగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొండాపూర్ మండల ఏపీఓ తొమ్మిదేళ్ల సర్వీస్‌పై సమగ్రంగా విచారణ చేసి, ఇప్పటివరకు జరిగిన బదిలీల్లో ఎందుకు కొనసాగించారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు."అందరికీ బదిలీలు.. ఏపీఓకు మాత్రం మినహాయింపా?" అనే ప్రశ్నకు జిల్లా ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది..






# గ్రామసభలకు కాంగ్రెస్ శ్రేణులు తప్పనిసరిగా హాజరు కావాలి ఆంజనేయులు గౌడ్

మొదటిపేజీ తరువాయి

ముఖ్యంగా దీూాం గ్రామసభలకు తప్పనిసరిగా హాజరై ూా×= ముసాయిదా ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలని. జాబితాలో పేర్లు ఉన్నవారితో పాటు, పేర్లు లేని అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలించి వారి పేర్లు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అర్హులైన ఓటర్లకు సంబంధించిన నోటీసులు, అవసరమైన ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో గ్రామసభల్లో కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని, ఓటర్ల జాబితా ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# హనుమాన్ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

మెదక్ (ప్రజాజ్యోతి )

మెదక్ జిల్లా నిజాంపేట మండలం చౌకస్పల్లి గ్రామపంచాయతీ పరిధిలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించనున్న హనుమాన్ దేవాలయానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు అనుగుణంగా దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమని ఎమ్మెల్యే తెలిపారు. హనుమంతుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# మీలాద్ ఉన్ నబీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న

## - కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల్ రెడ్డి మరియు టిజిఐడిసి మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్

జహీరాబాద్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి న్యూస్)



పట్టణంలోని ఈద్గా మైదానంలో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్క రించుకుని నిర్వహించిన పేద ముస్లిం కుటుంబాల నికాహ్ కార్యక్రమం మరియు రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్ధం0 ఉజ్వల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన దంపతు లను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్త దాతలను అభినందించారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పేదలకు అండగా నిలవడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం మానవత్వానికి గొప్ప సేవ అని ఆయన పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపిన ప్రేమ, కరుణ, సేవా మార్గాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలోని పేదలు, నిరుపేదలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిలాద్ కమిటీ సభ్యులు, మతపెద్దలు, నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట టీజీఈజేఏసీ మహాధర్నా

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 26:

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య నారాయణఖేడ్ మండల శాఖ అధ్యక్షుడు ఏసుదాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరాం నాయక్ తెలిపారు. స్థానిక టీఎస్ యూటీఫ్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ఆగస్టు 27న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ మహాధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మండలంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలిరావాలని మండల కమిటీ విజ్ఞప్తి చేసింది.ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ఐక్యంగా గళం వినిపించేందుకు నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.




# ఆడబిడ్డల వివాహానికి చేయూత

## - హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల.విమల శ్రీనివాస్ రెడ్డి

జహీరాబాద్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి న్యూస్)

హుగ్గెల్లీ గ్రామంలో ఆడబిడ్డల వివాహానికి చేయూత నిస్తున్నామని సర్పంచ్ పట్లోళ్ళ. విమల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని బూతపిల్లి శంకరమ్మ -బక్కప్ప కుమార్తె వైష్ణవి (గాయత్రీ) వివాహ కార్యక్ర మానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వధువు కుటుంబ సభ్యులు తమ కుమార్తె పెళ్లికి సహాయం అందించిన సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు, వార్డు సభ్యులు బాల్ రాజు, సాల్మన్, సీనియర్ నాయకులు మునిందర్ రెడ్డి నర్సింహులు, అశోక్, వెంకట్ స్వామి, అక్బర్, ప్రవీణ్ పాండు, లక్ష్మారెడ్డి, ప్రకాష్,తో పాటు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# 34వ వర్ధంతి స్మారక ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్న

## - కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల రెడ్డి మరియు టిజిఐడిసి మాజీ చైర్మన్

**జహీరాబాద్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి న్యూస్)**

పట్టణంలోని గార్డెన్ నగర్‌లోని ఎంఆర్ హెచ్ ఎస్ పాఠశాలలో దివంగత రెవ. జార్జ్ బి. గార్డెన్ దొర గారి 34వ వర్ధంతి స్మారక ప్రార్థనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ ముఖ్య అతిథిగా పాల్గొని, దివంగత రెవ.జార్జ్ బి.గార్డెన్ దొర గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత రెవ. జార్జ్ బి. గార్డెన్ దొర గారు సమాజానికి చేసిన సేవలు, విద్యా మరియు ఆధ్యాత్మిక రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయా లను కొనసాగిస్తూ సమాజ అభ్యున్న తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, మెమోరియల్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# అనారోగ్యంతో బాధపడుతున్న రైతు ఆత్మహత్య

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 26:**



అనారోగ్యం, కాలి నొప్పితో బాధపడుతున్న ఓ రైతు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బోరంచ గ్రామంలో చోటుచేసుకుందని మనూర్ ఎస్సై ఏ. కోటేశ్వర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బోరంచ గ్రామానికి చెందిన కాపులాపురం వీరారెడ్డి (54) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పుట్టుకతోనే పోలియో కారణంగా ఆయన కుడికాలు పనిచేయకపోయినా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు.అయితే ఏడాది క్రితం జరిగిన ప్రమాదంలో ఆయన ఎడమకాలు విరగడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. ఎడమకాలి నొప్పి తీవ్రంగా ఉండటంతో పాటు అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు.ఈ క్రమంలో మంగళవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలోనే వీరారెడ్డి మృతి చెందాడు.మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తదుపరి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# మండలంలో ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

**రాయికోడ్ ఆగస్టు 26 (ప్రజా జ్యోతి):**



మండలంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సింగీతం గ్రామంలో రణం కట్ట నుంచి జెండా వరకు భారీ ర్యాలీ చేపట్టగా చిన్నారులు,యువకులు,పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై చైతన్య కిరణ్‌తో పాటు గ్రామ పెద్దలను రఫిక్ శాలువాలు,పూలమాలలతో సత్కరించారు.అనంతరం మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ,కరుణ, శాంతి, సోదరభావం గురించి వివరించారు.హిందూముస్లింలు అన్నదమ్ముల్లా ఐక్యంగా ఉంటూ శాంతి,సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలని రఫిక్ పిలుపునిచ్చారు. కార్య క్రమంలో ముస్లిం సోదరులు,యువకులు,చిన్నారులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ షాపుల్లో అడ్డగోలుగా ఎరువుల విక్రయాలు..

## - బుకింగ్ పేరుతో రైతులకు బాదుడు.. - అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువుల విక్రయాలపై రైతుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎరువుల కొరతను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు బుకింగ్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ, అడ్డగోలుగా ఎరువులు విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు విక్రయించాల్సి ఉండగా, కొందరు వ్యాపారులు నిబంధనలను పక్కనపెట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎరువులు అవసరమైన సమయంలో దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, బుకింగ్ పేరుతో ముందుగా డబ్బులు తీసుకోవడం, అవసరమైన పరిమాణంలో ఎరువులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు.

### వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

మండలంలో ఫర్టిలైజర్ దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అధికారుల పర్యవేక్షణపై రైతులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఎరువుల ధరలు, నిల్వలు, విక్రయ రికార్డులు, రైతులకు అందిస్తున్న బిల్లులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.

### అధిక ధరలకు విక్రయిస్తే సీజ్ చేయాలి

ఎరువులను నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఫర్టిలైజర్ షాపులను సీజ్ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే బుకింగ్ పేరుతో జరుగుతున్న అక్రమ విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.రైతుల అవసరాన్ని వ్యాపారానికి ఆసరాగా చేసుకోకుండా.. అధికారులు వెంటనే స్పందించి మండలంలోని అన్ని ఫర్టిలైజర్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహీంద్రా ట్రాక్టర్స్ చనిపోయిన కార్మికుడికి నష్టపరిహారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో

## యజమాన్యంతో చర్చలు, ఆందోళన, చివరకు చర్చలు సఫలం

జహీరాబాద్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి న్యూస్)



మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ కార్మికుడి మృతికి నష్టపరిహారం కై సిఐటియు ఆందోళన, నష్టపరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం. మహేంద్ర ట్రాక్టర్స్ లో పనిచేస్తున్న రాజేష్ అనే కార్మికుడు గుండెపోటుతో మరణించడంతో కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని మానవతా దృక్పథంతో కార్మికుడు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలనికోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో యాజమాన్యంతో ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతి నిధులకు సిఐటియు నాయకులతో పాటు కాలనీ పెద్దలతో ఘర్షణ జరిగింది. ఘర్షణ అనంతరం యాజమాన్యం రూ/- 7,50,000 తో పాటు ఒకరికి ఉపాధి చూపేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించి జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఫిక్స్ టర్మ్ అండ్ నాన్ రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.మహిపాల్ మాట్లాడుతూ డబ్ల్యూఎల్ ఐపి, యశస్విని లాంటి ఎఫ్ టి ఈ రకరకాల పేర్లతో తీసుకుంటున్న కార్మికులకు కనీస భద్రత లేకపోవడం, చట్టపరమైన సౌకర్యాలు ఈఎస్ఐ, పీఎఫ్ లాంటివి కూడా లేకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరిగి నప్పుడు కార్మికులను కార్మికుల కుటుంబా లను ఆదుకునేందుకు కూడా కష్టతరం అవుతుందని తక్షణమే ఇలాంటి కార్మికు లందరికీ చట్టపరమైన సౌకర్యాలను వర్తింప చేయాలని అప్పుడే కార్మికులకు భద్రత ఏర్పడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి రకాల కార్మికులను తీసుకునేందుకు ప్రోత్సహిస్తూన్న మూలంగానే కార్మికులకు ఉద్యోగానికి ప్రాణాలకు భద్రత లేకుండా పోతుందని అన్నారు. తక్షణమే ఎఫ్ టి ఈ విధానాన్ని, నాన్ రెగ్యులర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్ అశోక్ శేరి, మహీంద్రా ట్రాక్టర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గణేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్ నాయకులు అనిల్ సురేష్ శ్రీశైలం శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ కిరణ్, తదితరులు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏకగ్రీవం




సంగారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి :

సంగారెడ్డి జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, సిబ్బంది మధ్య సమన్వయంతో అసోసియేషన్ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎ. జనార్ధన్, ఉపాధ్యక్షులుగా బి. రమేష్, బి. నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎం. రాజారామ్, సహాయ కార్యదర్శిగా జి. సంతోష్ కుమార్, కోశాధికారిగా కూన రమేష్,కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ కరీమ్, టి. వెంకటేశం, పి. అరుణ కుమారి, అంగోథ్ రమేష్, మహమ్మద్ ముజామిల్, జి. శ్రీనివాస్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని తెలిపారు. సిబ్బంది సంక్షేమానికి



అధిక ప్రాధాన్యం ఇస్తూ, అందరి సహకారంతో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మిలాద్-ఉన్-నబీ పండగ సందర్భంగా సామూహిక వివాహాల కార్యక్రమంలో పాల్గొన్నా

## - మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్

జహీరాబాద్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి న్యూస్)

పట్టణంలోని ఈద్గా మైదానంలో మిలాద్ - ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సామూహిక వివాహాల కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు డా॥ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సామూహిక వివాహాలు జరుపు తున్న మిలాద్ ఉన్ నబి కమిటీ సభ్యులకు అభినందనలు తెలియ జేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన దాతలను అభినందించారు. సమాజ సేవలో భాగంగా రక్తదానం చేయడం ఎంతో గొప్ప సేవ అని పేర్కొంటూ, రక్తదాతల సేవాభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమం ప్రేమ, సోదర భావం, మానవత్వం మరియు సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ యూనుస్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షులు కండేం.నర్సింలు కౌన్సిలర్ మహేష్ కుమార్, సర్పంచ్ ప్రేమ్ రాథోడ్, కాంగ్రెస్ నాయకులు వాసీమ్, గౌస్, ఇనాయత్, అజర్, మెయిన్, మొయిజ్, యువజన కాంగ్రెస్ నాయకులు సోహైల్, మిలాద్ కమిటీ సభ్యులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు..





# సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 26:



టీయూడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ సాధారణ సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షులు అమృత్ కోరారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. ఈ నెల 27వ తేదీ గురువారం మధ్యాహ్నం 12 గంటలకు నారాయణఖేడ్ పట్టణంలోని కార్తికేయ రెస్టారెంట్‌లో టీయూడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ సాధారణ సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డితో పాటు జిల్లా యూనియన్ నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్‌కు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. యూనియన్ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఎర్రోళ్ల లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్...

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎర్రోళ్ల రవి తండ్రి ఎర్రోళ్ల లక్ష్మయ్య మృతి చెందడంతో వారి కుటుంబాన్ని సంగారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు చింతా ప్రభాకర్ పరామర్శించారు. లక్ష్మయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వారి కుటుంబ సభ్యులను కలిసి మృతికి గల కారణాలను తెలుసుకుని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, లక్ష్మయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మామూళ్ల రాజేందర్, మండల పార్టీ అధ్యక్షులు విట్టల్, గోవర్ధన్, ప్రేమానందం, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ బుచ్చయ్య, టెంటు బాలు, రాములు, ప్రదీప్, గంగయ్య, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



# రామచంద్రాపురం 112వ డివిజన్‌లో ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు

## - పాల్గొన్న బిఆర్ఎస్ నేత అబ్బు అలీ ఖురేషిరామచంద్రాపురం అర్బన్:

**సంగారెడ్డి జిల్లా**

రామచంద్రాపురం అర్బన్ పరిధిలోని GHMC 112వ డివిజన్‌లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఖ్రూఖూ మండల అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బు అలీ ఖురేషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులంతా బుధవారం నాటి ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తమ పెద్దలను భక్తితో స్మరించుకుంటూ ప్రత్యేక దువా చేశారు. ప్రార్థనల అనంతరం అక్కడ చేరిన వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకుంటూ, "భాయ్ భాయ్" అంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అబ్బు అలీ ఖురేషితో పాటు స్థానిక ప్రముఖులు అబ్దుల్లా, సలార్, తౌఫీక్, అక్తర్, జి. షాన్, ఆసిఫ్, రెహమాన్ మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, స్థానికులు పాల్గొన్నారు. అందరూ కలిసికట్టుగా ప్రార్థనలు నిర్వహించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మిలాదున్నబీ పర్వదినం

## - ప్రేమ, శాంతి, సమానత్వానికి ప్రతీక!

**కల్హేర్, ఆగస్టు 26:, ప్రజా జ్యోతి.**

మిలాదున్నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు.. స్థానిక జామే మసీదులో మౌలానా మహమ్మద్ మౌలానా అబ్దుల్ లతీఫ్. ముఖ్య అతిథి జామే మస్జిద్ కమిటి సరదర్ అబ్దుల్ ఖతోబుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. మౌలానా లతీఫ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ జీవితం (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినాన్ని స్మరించుకునే ఈ పవిత్ర సందర్భం ప్రేమ, దయ, సహనం, సమానత్వం, మానవ సేవ, శాంతి, సోదరభావం వంటి విలువలను గుర్తుచేస్తుంది.



### రబీ ఉల్ అవ్వల్‌కు ప్రత్యేక ప్రాధాన్యం

రబీ ఉల్ అవ్వల్ ఇస్లామిక్ హిజ్రీ క్యాలెండర్‌లో మూడవ నెల. ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ నెలలో జన్మించారని ముస్లింలు విశ్వసిస్తారు. అందువల్ల ఈ నెలకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ఈ సందర్భంగా ప్రవక్త జీవిత చరిత్ర, బోధనలు, ఆదర్శాలను స్మరించుకోవడంతో పాటు దురూద్, ప్రార్థనలు, సీరత్ పఠనం, పేదలకు సహాయం వంటి సత్కార్యాలకు ప్రాధాన్యం ఇస్తారు. ప్రవక్త జన్మించిన ఖచ్చితమైన తేదీ విషయంలో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఆయన జననం రబీ ఉల్ అవ్వల్ నెలలోనే జరిగిందనే విషయంలో విస్తృతంగా అంగీకారం ఉంది.

### మానవత్వమే ప్రధాన సందేశం

ప్రవక్త మహమ్మద్ బోధనలు ఏకదైవారాధనతో పాటు నిజాయితీ, మంచి నడవడి, న్యాయం, క్షమ, దయ, సహనం, మానవ సేవలకు ప్రాధాన్యం ఇస్తాయి. పేదలు, అనాథలు, బలహీనులు, పొరుగువారికి సహాయం చేయడం, ప్రతి మనిషిని గౌరవించడం, హింస, ద్వేషం, మోసం, దోపిడీ, అహంకారాలకు దూరంగా ఉండడం ఆయన బోధనలలో ముఖ్యమైన అంశాలు. కులం, వర్ణం, సంపద వంటి భేదాలకు అతీతంగా ప్రతి మనిషికి గౌరవం ఇవ్వాలని, సమాజంలో న్యాయం, శాంతి, సామరస్యాన్ని నెలకొల్పాలని ఆయన బోధనలు సూచిస్తాయి.

### మహిళల హక్కులకు ప్రాధాన్యం

లిమహిళలను గౌరవంతో, దయతో, న్యాయంగా చూడాలని ప్రవక్త మహమ్మద్ బోధించారు. మహిళల గౌరవం, భద్రత, వ్యక్తిగత హక్కులను కాపాడాలని, వివాహంలో వారి సమ్మతికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మహిళలకు ఆస్తి, వారసత్వం, వివాహ సంబంధిత హక్కులు కల్పించడం, కుమార్తెలను ప్రేమతో పెంచడం, తల్లులను గౌరవించడం, మహిళలపై హింస, అవమానం, వేధింపులు, అన్యాయాలకు దూరంగా ఉండటం వంటి అంశాలకు ఇస్లామీయ బోధనల్లో ప్రాధాన్యత ఉంది. మహిళలకు జ్ఞానం, విద్య, సామాజిక గౌరవం కల్పించడం కూడా మానవీయ సమాజ నిర్మాణంలో కీలకమని ఈ బోధనలు తెలియజేస్తాయి.



### శాంతి, సోదరభావం కోసం సంకల్పం

మిలాదున్నబీ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ బోధించిన ప్రేమ, దయ, సహనం, సమానత్వం, శాంతి, మానవ సేవ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలి. మతం, కులం, వర్గం, ప్రాంతం వంటి భేదాలను అధిగమించి పరస్పరం గౌరవించుకోవడం ద్వారా సమాజంలో ఐక్యతను బలోపేతం చేయాలి. ప్రవక్త మహమ్మద్ బోధనలు ప్రపంచ శాంతికి , మానవత్వానికి స్ఫూర్తిగా నిలవాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ప్రతి సమాజంలో సోదరభావం, ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని ఈ మిలాదున్నబీ పర్వదినం సందర్భంగా ఆకాంక్షిద్దాం.

**ముస్లిం సోదర సోదరీమణులందరికీ మిలాదున్నబీ శుభాకాంక్షలు.**

# జర్నలిస్టు భూమయ్యకు అండగా నిలిచిన మంత్రి యాదగిరి దామోదర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

**అందోల్, ఆగస్టు 26, (ప్రజా జ్యోతి):**

అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయుడు అల్లాదుర్గం భూమయ్యకు తక్షణమే స్పందించి మెరుగైన వైద్యం అందించేందుకు సహకరించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల రాష్ట్ర సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యుడు మునిపల్లి యాదగిరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూమయ్య బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన విషయం మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించారని యాదగిరి తెలిపారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించడంతో పాటు, భూమయ్యను స్వయంగా పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం మంత్రి మానవతా దృక్పథానికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం భూమయ్య ఆరోగ్యం మెరుగుపడుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంతోషం వ్యక్తం చేసి, త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారని యాదగిరి తెలిపారు. జర్నలిస్టు ఆపదలో ఉన్నాడని తెలిసిన వెంటనే స్పందించి అండగా నిలిచిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు జర్నలిస్టుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు అని యాదగిరి పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల మంత్రి చూపుతున్న చొరవ, ఆప్యాయత, మానవతా దృక్పథాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని అన్నారు.



# డీసీసీ పీఠంపై శివశంకర్ ఆశలు

## - పార్టీ అధిష్ఠానం, మంత్రి దామోదర్ ఆశీస్సులపై అనుచరుల్లో ఆసక్తి





**అందోల్, ఆగస్టు 26, (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవికి సంబంధించి కాంగ్రెస్ పార్టీలో చర్చలు ఊపందుకుంటున్న వేళ జోగిపేటకు చెందిన యువ నాయకుడు డాకూరి శివశంకర్ పేరు కూడా తెరపైకి వస్తోంది. సుదీర్ఘకాలంగా పార్టీతో కొనసాగుతున్న అనుబంధం, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా అనుభవం, కార్యకర్తలుయువతతో సన్నిహిత సంబంధాలు ఆయనకు కలిసొచ్చే అంశాలుగా అనుచరులు భావిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలోనూ అండగా నిలిచిన కుటుంబ నేపథ్యం శివశంకర్‌కు మరో బలంగా కనిపిస్తోంది. ఆయన తాతయ్య గాలయ్య ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, జోగిపేట సర్పంచ్‌గా సేవలందించగా, తండ్రి డాకూరి జోగినాథ్ జోగిపేట సర్పంచ్‌గా మూడు పర్యాయాలు పనిచేశారు. ఈ రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ శివశంకర్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారని అనుచరులు చెబుతున్నారు.

### కార్యకర్తలతో అనుబంధమే బలం

కౌన్సిలర్‌గా పనిచేసిన సమయంలో స్థానిక సమస్యలను ప్రస్తావించడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తలను సమన్వయం చేయడంలో శివశంకర్ కీలకంగా వ్యవహరించారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం ఆయనకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందని చెబుతున్నారు.జిల్లా స్థాయి బాధ్యతలు చేపట్టే నాయకుడికి అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసే సామర్థ్యం అవసరమని, ఆ విషయంలో శివశంకర్‌కు ఉన్న పరిచయాలు ఉపయోగపడతాయని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు.

### మంత్రి ఆశీస్సులు కీలకమేనా?

ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష పదవి కోసం పలువురు నాయకుల పేర్లు పరిశీలనలో ఉన్న నేపథ్యంలో శివశంకర్‌కు పార్టీ అధిష్ఠానం నుంచి ఎంతవరకు మద్దతు లభిస్తుంది? స్థానికంగా కీలక నేతగా ఉన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులు ఆయనకు దక్కుతాయా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.అందోల్ నియోజకవర్గానికి చెందిన నాయకుడిగా శివశంకర్‌కు మంత్రి దామోదర్‌తో ఉన్న రాజకీయ అనుబంధం, పార్టీ కార్యక్రమాల్లో ఆయనకు ఉన్న పాత్ర వంటి అంశాలు ఈ నియామకంలో ప్రభావం చూపుతాయా అన్న చర్చ కూడా జరుగుతోంది. అయితే తుది నిర్ణయం మాత్రం పార్టీ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంటుంది.

### పదవి వస్తే జిల్లా రాజకీయాల్లో కొత్త బాధ్యత

డీసీసీ అధ్యక్ష పదవి దక్కితే జోగిపేట రాజకీయాలకే పరిమితం కాకుండా జిల్లా వ్యాప్తంగా పార్టీని సమన్వయం చేసే బాధ్యత శివశంకర్ భుజాలపై పడనుంది. ముఖ్యంగా యువతను కాంగ్రెస్ వైపు ఆకర్షించడం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను మరింత బలోపేతం చేయడం, నియోజకవర్గాల మధ్య సమన్వయం పెంచడం వంటి సవాళ్లు ఎదురుకానున్నాయి.ఇప్పటికే పార్టీ కోసం పనిచేసిన అనుభవం, కుటుంబ రాజకీయ నేపథ్యం, కార్యకర్తలతో ఉన్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని శివశంకర్‌కు జిల్లా స్థాయి బాధ్యత అప్పగించాలని ఆయన అనుచరులు కోరుతున్నారు.అయితే డీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనేది పార్టీ అధిష్ఠానం నిర్ణయం. శివశంకర్ పేరుకు అధిష్ఠానం ఎంత ప్రాధాన్యత ఇస్తుంది? మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులు ఆయనకు లభిస్తాయా? లేక మరొకరికి అవకాశం దక్కుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.



# రోడ్డును బాగు చేసి ప్రయాణ సమస్యలు తీర్చండి



**మునిపల్లి ఆగస్టు 26(ప్రజాజ్యోతి):**

మునిపల్లి మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామము నుండి తక్కడపల్లి గ్రామము వరకు మంజూరైన తారు రోడును తొందరగా పూర్తి చేసి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రయాణ సమస్యలను తీర్చాలని ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.గత సంవత్సరం ఆగస్టులో మంజూరైన ,పనులను ప్రారంభించిన ఈ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. 1.8 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు పనులు ఎందుకు పూర్తి చేయటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.26 లక్షలు మంజూరయ్యాయి.కానీ కేవలం మోరం కంకర వేసి వదిలేశారు. దీంతో ప్రజలకు ప్రయాణ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు,ప్రజాప్రతినిధులు,స్పందించి రోడ్డును తారు రోడ్డుగా మార్చాలనీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.

